



# WANTED విలేకరులు కావలెను

www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 04 (కాంప్లిమెంటరీ కాపీ) | గురువారం | 04.04.2024




‘మన చౌరాస్తా’ తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ‘మన చౌరాస్తా’ సాదర స్వాగతం పలుకుతోంది.

**సెల్ : 9676400812**

## తెలంగాణలో డీఎస్సీ పరీక్ష
# దరఖాస్తుల గడువు పొడిగింపు




హైదరాబాద్, మన చౌరాస్తా : తెలంగాణలో డీఎస్సీ పరీక్షకు దరఖాస్తుల గడువును విద్యాశాఖ పొడిగించింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆన్‌లైన్ అప్లికేషన్లకు నేటితో గడువు ముగిసింది. అయితే దీనిని జూన్ 20 వరకు పొడిగించింది. దీంతో అభ్యర్థులు రూ.100 చొప్పున దరఖాస్తు రుసుం చెల్లించి జూన్ 20వ తేదీ రాత్రి 11.50 గంటల వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చు. అలాగే డీఎస్సీ పరీక్ష తేదీలను ఖరారు చేశారు. జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిం చనున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో మొత్తం 11,062 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ వచ్చింది. ఇందులో 2,629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నా యి. 727 భాషా పండితు లు, 182 పీఈటీలు, 6508 ఎస్జీటీలు, స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 220 స్కూల్ అసిస్టెంట్, 796 ఎస్జీటీ ఉద్యోగాలు ఉన్నాయి.



## జనగామ ఏసీపీగా
# అంకిత్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ నూతన ఏసీపీగా అంకిత్ కుమార్ (ఐపీఎస్)ను నియమించారు. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వలు జారీ చేశారు. గతంలో ఇక్కడ ఏసీపీగా పనిచేసిన దామోదర్‌రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లఘించారని వేటు వేసిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పార్థసారధికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. తాజాగా ప్రభుత్వం అంకిత్‌కుమార్‌ను ఏసీపీగా నియమించింది.

## ఆధారాలు లేని రూ. లక్ష పట్టివేత

**మహబూబాబాద్, మన చౌరాస్తా :** సరైన ఆధారాలు లేనకుండా తరలిస్తున్న రూ. లక్ష రూపాయలను పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలీసులు చెకింగ్ లను ముమ్మరం చేశారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహుల పేట మండలం వంతడుపుల స్టేజి వద్ద సరైన ఆధారాలు లేని లక్ష రూపాయలను పట్టుకున్నారు. వాటిని ఫ్లయింగ్ స్క్వాడ్‌కి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.





# 1 నుంచి 9 వ తరగతి విద్యార్థులకు పరీక్షలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు ఏప్రిల్ 8 నుంచి సమ్మేటివ్ అసెస్ మెంట్ (ఎస్ఏ 2) పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అన్ని పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యా ర్థులకు ఏప్రిల్ 8 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 8, 10, 13, 15 తేదీల్లో 1 నుంచి 5వ తరగతి వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించ నున్నారు. ఇక 6 నుంచి 8 తరగతుల పరీక్షలు ఏప్రిల్ 8, 10, 13, 15, 16, 18 తేదీల్లో జరగనున్నాయి. ఒక్క 9వ తరగతి విద్యార్థులకు మాత్రం ఏప్రిల్ 19 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి.

## బాల్క సుమన్
# ఓ చిల్లరగాడు

### – ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీరియస్



**వరంగల్, మన చౌరాస్తా :** బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పై మాజీ మంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సీరియస్ అయ్యారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బాల్క సుమన్ ఓ చిల్లరగాడు అని ఘాటు విమర్శలు చేశారు. చిల్లరగాళ్ల మాటలకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. బలవంతుడిని కాబట్టే బీఆర్ఎస్ నేతలు అంతా తనను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నట్లుగా తెలంగాణలో కరువుకు కాంగ్రెస్ పార్టీ కారణం కాదని స్పష్టం చేశారు. ఏం మాట్లాడాలో తెలియక బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని ఫైర్ అయ్యారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితం ఒక తెరిచిన పుస్తకమని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేతలు తనపై చేసిన ఆరోపణలను రుజువు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఇటీవల బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కడియం శ్రీహరి అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి పార్టీ ఫిరాయించిన కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలకు తాజాగా కడియం కౌంటర్ ఇచ్చారు.



## దొడ్డి కొమరయ్య సినిమా
# షూటింగ్ షురూ

దేవరుప్పుల, మన చౌరాస్తా : బుధవారం కడివెండి గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యింది. దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని ముహూర్తం షార్ట్ తీశారు. దొడ్డి కొమరయ్య సినిమా డైరెక్టర్ సేనాపతి తల్లిదండ్రులైన మహాలంక చంద్రయ్య, చంద్రమ్మ కెమెరా స్విచ్ ఆన్ చేసి షూటింగ్ ప్రారంభించగా దొడ్డి కొమురయ్య వారసులు దొడ్డి బిక్షపతి, అనసూయ సినిమాకి క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఆనాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుల మీద సినిమా తీయడం చాలా గొప్ప ప్రయత్నమని దర్శకుడు సేనాపతిని అభినందించారు. పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ పాలకుర్తి అంటేనే పోరాటాల గడ్డ అని అన్నారు. దొడ్డి కొమరయ్య సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు. దర్శకుడు సేనాపతి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటం చేసిన దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుందని. ఈ చిత్రం ద్వారా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులను తెలంగాణ ప్రజలకు పరిచయం చేయబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ 33 జిల్లాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కన్వీనర్లు, కో కన్వీనర్లు, సబ్బండ వర్గాలకు చెందిన అన్ని కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని ఆకాంక్షించారు.

Local News

# మొదటి దశ ఈవీఎం ర్యాండమైజేషన్ పూర్తి



**జనగామ, మన చౌరాస్తా :** పార్లమెంటు ఎన్నికలలో భాగంగా పారదర్శకంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవీఎం, వీవీ ప్యాడ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్, ఆర్డీవోలుతో కలసి జిల్లా ఎన్నికల అధికారి ఈబీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా జనగామ జిల్లాలో మొదటి ఈబీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. జిల్లాలోని 98 జనగామ, 99 స్టేషన్‌ఘన్‌పూర్, 100 పాలకుర్తి నియోజకవర్గాలకు సంబంధించి 869 పోలింగ్ కేంద్రాలకు ఆన్ లైన్ ద్వారా ఈవీఎంలను కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలో ఉన్న జనగామ నియోజకవర్గం పరిధిలో 278 పోలింగ్ కేంద్రాలకు గాను 347 కంట్రోల్ యూనిట్లు, 347 బ్యాలెట్ యూనిట్లు, 389 వీవీ ఫ్యాడ్లు అదేవిధంగా, ఘన్‌పూర్ స్టేషన్ నియోజకవర్గానికి సంబంధించి 295 పోలింగ్ కేంద్రాలకు కాను 368 కంట్రోల్ యూనిట్లు, 368 బ్యాలెట్ యూనిట్లు, 413 వీవీ ప్యాడ్లను, పాలకుర్తి నియోజకవర్గానికి సంబంధించి 296 పోలింగ్ కేంద్రాలకు గాను 370 కంట్రోల్ యూనిట్లు, 370 బ్యాలెట్ యూనిట్లు, 414 వీవీ ప్యాడ్లను మొత్తంగా 869 పోలింగ్ కేంద్రాలకు 1,085 బ్యాలెట్ యూనిట్లు, 1085 కంట్రోల్ యూనిట్లు, 1,216 వీవీ ప్యాడ్లకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్ లైన్ విధానం ద్వారా పారదర్శకంగా ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఆర్డీవోలు వెంకన్న, కొమరయ్య, కలెక్టరేట్ ఏవో రవీందర్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు, తహసీల్దార్లు, ఈడీఎం దుర్గారావు, ఎన్ఐసీ జాయింట్ డైరెక్టర్, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌కు వివరాలు అందించాలి

**జనగామ, మన చౌరాస్తా :** వివిధ శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు శాఖల వారీగా వివరాలు అందించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎసెన్షియల్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అందించేందుకు సంబంధిత శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శాఖల వారీగా పని చేస్తున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకునేందుకు పేరు, హోదా, ఓటర్ గుర్తింపు కార్డు, సెల్ నెంబర్ వంటి పూర్తి వివరాలతో వారంలోగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.



# క్షేత్రస్థాయిలో యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

- మండల ప్రత్యేక అధికారి, డీఏఓ వినోద్ కుమార్

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** ప్రతి గ్రామంలో క్షేత్ర స్థాయిలో యాక్షన్ ప్లాన్ రూపొందించాలని మండల ప్రత్యేక అధికారి, డీఏఓ వినోద్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ప్రత్యేక అధికారులతో, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, వివిధా శాఖల అధికారులు, మండల సమాఖ్య అధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఇచ్చిన ఉత్తర్వుల మేరకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఈ రెండు నెలల్లోపు పాఠశాలల మరమ్మతుల పనులను వేగంగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీఓలు పాఠశాలలను సందర్శించి సమస్యలను గుర్తించాలన్నారు. ఈ కమిటీకి చైర్మన్ గా మహిళా సంఘాల అధ్యక్షులు, కన్వీనర్ గా హెడ్ మాస్టర్ ఉంటారని ఆయన పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరకు రూ. 25,000 వరకు సంబంధిత సంఘాల ద్వారా అందిస్తామని, రూ. 25,000 నుంచి రూ. లక్ష వరకు ఎంపిడిఓలు ఆమోదించవచ్చని, రూ. లక్ష పైబడిన వాటికి జిల్లా కలెక్టర్ ఆమోదిస్తారని చెప్పారు.

### తాగునీటి సరఫరా అందించాలి...

మిషన్ భగీరథకు సంబంధించి వేసవి కాలం దృష్ట్యా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలన్నారు. తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తాగునీరుకు ఇబ్బంది లేకుండా మరమ్మతు పనులను చేపట్టాలని, మండల ప్రత్యేక అధికారి రెండు గ్రామ పంచాయతీలను, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి రెండు గ్రామాలను సందర్శించి, పరిశీలించాలని వివరించారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించి, ధృవీకరణ రిపోర్టును ఇవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఎంపిడివో రఘురామకృష్ణ, తహసీల్దారు విశాలక్షి, మండల వైద్యాధికారి సిద్దార్థ రెడ్డి, డాక్టర్ శరత్ కుమార్, ఇంచార్జ్ విద్యాధికారి డీవీఎల్ఎన్ మూర్తి, ఉపాధి హామీ ఏపీవో కృష్ణ, ఇరిగేషన్ ఏఈ హనుమంతు వివిధ శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రోజురోజుకూ ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉంటూ సరైన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ సిద్దార్థ రెడ్డి తెలిపారు. మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బయటకు వెళ్లేవారు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో బయటకు వెళ్లకపోవడం మంచిదన్నారు. ఎండ తీవ్రత పెరిగి తీవ్రమైన వేడి గాలులు వీచడం వలన దెబ్బ తగిలే ప్రమాదం ఉందని కావున బయటకు వెళ్ళినప్పుడు ఎక్కువగా నీరు, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు.

### ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత..

మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. అనంతరం సూచనలు సలహాలు ఇచ్చారు. వడదెబ్బ తగిలినట్లయితే తీవ్రమైన తలనొప్పి, శరీర ఉష్ణోగ్రత పెరగడం, నాలుక ఎండిపోవడం, అపస్మారక స్థితికి వెళ్లడం జరుగుతుందని అలాంటప్పుడు వెంటనే చల్లటి ప్రదేశానికి వెళ్లి ఫస్ట్ ఎయిడ్ చేసి వెంటనే హాస్పిటల్ కు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కన్నా.. మత విద్వేషాలే ఎక్కువ

**హనుమకొండ, మన చౌరాస్తా :** బీజేపీ పాలనలో అభివృద్ధి కన్నా మత విద్వేషాలను రెచ్చగొట్టి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. జిల్లాలోని బాల సముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయ ఇండియా కూటమి వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య,కు మద్దతు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి ,సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు , జిల్లా నాయకులను కలిసి కడియం గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా రేవూరి మాట్లాడుతూ.. పాలన లో అభివృద్ధి కన్నా మాత విద్వేషాలు రెచ్చగొట్టి పాలన చేస్తున్నారుఆర్థికంగా అభివృద్ధి చెందామని చెబుతూ ప్రజలను బీజేపీ మోసం చేస్తుందని అన్నారు. హిందువులను రాజకీయాలకోసం వాడుకుంటున్నారని విమర్శించారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే కేంద్రం లో ఇండియా కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. అభివృద్ధి కొరకే వివిధ పార్టీలతో ఇండియా కూటమిగా ఏర్పడి ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని తెలిపారు. వరంగల్ పార్లమెంట్ ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్య గెలుపు కొరకు అందరూ శ్రమించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు అందరూ కడియం కావ్యను గెలిపించాలని కోరారు. మాదిగ ఉప కులాలలో మందకృష్ణ మాదిగ చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందాలి అనుకుంటున్నారని రేవూరి అన్నారు. మతతత్వ బీజేపీని మందకృష్ణ మాదిగ తన స్వలాభం కోసం గెలిపించాలంటున్నారని అన్నారు.



# కేకేఆర్ హ్యాట్రిక్ విజయం

- విశాఖలో పరుగుల సునామీ
- ఢిల్లీపై కోల్‌కతా ఘన విజయం
- దంచికొట్టిన నరేన్, రఘువంశీ, రస్సెల్, రింకు
- ఢిల్లీ ముందు 273 టార్గెట్
- 166కే పరిమితమైన పంత్ సేన
- 106 పరుగుల తేడాతో కేకేఆర్ విన్
- పంత్, స్టబ్స్ హాఫ్ సెంచరీలు

**మన చౌరాస్తా, క్రీడా విభాగం :** విశాఖ బుధవారం రాతి పరుగుల సునామీ వచ్చింది. ఢిల్లీ, కోల్‌కతా మధ్య ఐపీఎల్ మ్యాచ్ లో పరుగుల వర్షం కురిసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కోల్‌కతా.. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 272 పరుగులు చేసింది. ఓపెనర్ సునీల్ నరైన్ (85; 39 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సులు) ఢిల్లీ బౌలర్లను ఊచకోత కోయగా.. వన్‌డౌన్ లో వచ్చిన బ్యాటర్ రఘువంశీ (54; 27 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులు) కూడా దంచికొట్టాడు. ఆండ్రీ రస్సెల్ (41; 19 బంతుల్లో), రింకు సింగ్ (26; 8 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) ఆశమే హద్దుగా చెలరేగి ఆడటంతో.. కేకేఆర్ భారీ స్కోర్ చేయగలిగింది. ఢిల్లీ బౌలర్లలో నోకియా 3, ఇషాంత్ శర్మ 2, ఖలీల్ అహ్మద్, మిచెల్ మార్ష్ తలో వికెట్ పడగొట్టారు.అనంతరం 273 పరుగుల భారీ టార్గెట్ తో బరిలోకి దిగిన ఢిల్లీ 17.2 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్ (55; 25 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సులు), ట్రిస్టన్ స్టబ్స్ (54; 32 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సులు) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. భారీ స్కోర్ చేధించేటప్పుడు స్టార్టింగ్ అద్భుతంగా ఉండాలి. కానీ ఢిల్లీకి ఆరంభం బాగా లేదు. పృథ్వీ షా (10), మిచెల్ మార్ష్ (0), అభిషేక్ పోరెల్(0), వార్నర్ (18) తీవ్రంగా నిరాశపరిచారు. ఆ తర్వాత పంత్, స్టబ్స్ కొన్ని మెరుపులు మెరిపించినా.. ఆ తర్వాత వరుస వికెట్లు పడటంతో.. 166 పరుగుల వద్ద ఢిల్లీ ఆలౌట్ అయింది.

## కోల్‌కతా ఖాతాలో హ్యాట్రిక్ విజయాలు

ఈ సీజన్ లో హ్యాట్రిక్ విజయాలు నమోదు చేసిన జట్లుగా రాజస్థాన్ నిలవగా.. ఇప్పుడు కోల్ కతా కూడా హ్యాట్రిక్ విజయాలతో జోరుమీద కనబడు తోంది. ఆ తర్వాత చెన్నై, గుజరాత్, లక్నో జట్లు ఆడిన మూడు మ్యాచ్ లలో రెండింటిలో విజయం సాధించిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా కోల్ కతా జట్టుకు నరేన్ ఫ్లయింగ్ స్టార్టింగ్ ఇస్తుండటంతో.. ఆ జట్టు విజయం చాలా సులవు అవుతుంది.







# మరో ముందడుగు..

# చౌరాస్తా.. ఇక..



www.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way




పాఠక, వీక్షక దేవుళ్లకు నమస్తే..! మూడేళ్ల కింద చిన్న బ్లాగ్‌తో ప్రారంభమైన నా ‘చౌరాస్తా’ ప్రస్థానం.. అంచెలంచెలుగా విస్తరించి.. వెబ్ సైట్‌గా మారింది. తర్వాత ఈ - పేపర్‌గా ప్రారంభమై.. నాటి నుంచి నేటి వరకు డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. తాజాగా మరో మైలురాయిని దాటుకుంటూ **RNI** పర్మిషన్‌తో ఇక ‘మన చౌరాస్తా’గా మారి మరింత విస్తరించబోతోంది. ఇంతకాలం ఆదరించినట్టుగానే ఇక ముందు కూడా మీరు **‘మన చౌరాస్తా’** పేపర్‌ను అక్కున చేర్చుకుంటారని ఆశిస్తూ... **- మీ.. ఉప్పలంచి నరేందర్**